బాలికా ఆరోగ్యంపై చర్యలు భళా!

గుంటూరులోని ఓ కార్పొరేట్ కాలేజీలో జూనియర్ ఇంటర్ చదివే బాలిక అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైంది. హుటాహుటిని విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసి తేల్చిందేమంటే అజీర్తి జబ్బు, రక్తహీనత. ప్యాకేజ్డ్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌లు ఎక్కువగా తినటం, పోషకాహారం తీసుకోకపోవడం, తగిన వ్యాయామం లేకపోవటం కారణంగా వైద్యులు తేల్చారు.

- కౌమార బాలికల్లో పోషకాహార లోపంపై ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్
- ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 10–19 ఏళ్ల బాలికలకు స్క్రీనింగ్ టెస్టులు
- రక్తహీనత కలిగినవారికి ఐరన్ ఫోలిక్ మాత్రల పంపిణీ


బాలికలకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

తెనాలిలో జరిగిన స్క్రీనింగ్ టెస్టుల వివరాలు

అర్బన్ హెల్త్ సెంటరు	పరీక్షించిన విద్యార్థుల సంఖ్య	మైల్డ్	మోడరేట్	సివియర్
ఆరు యూపీహెచ్‌సీల పరిధిలో	2,233	834	379	06
ఆరు పీహెచ్‌సీల పరిధిలో	4,687	1,071	1,183	09
మొత్తం	6,920	1,914	1,562	15

తెనాలి: జీవనశైలి, ఆహారంతోపాటు పర్యావరణం కూడా జన్యువులు పనిచేసే విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి... బాల్యంలో అనారోగ్యానికి, పోషకాహార లోపానికి గురైతే తీవ్ర దీర్ఘకాలిక ప్రభావాలు ఉంటాయని సీసీఎంబీ పరిశోధనలో వెల్లడైన అంశం. కేవలం గుంటూరు అమ్మాయే కాదు. ముఖ్యంగా ప్రైవేటు/ కార్పొరేట్ పాఠశాలలు, కాలేజీల్లో చదువుతున్న ఎందరో విద్యార్థినులు ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారు. వాష్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుందని తరచూ నీళ్లు తాగకపోవటం, బయట తిళ్లు అధికంగా తినటం, ఆటలకు అవకాశం లేకపోవటం వంటివన్నీ ప్రధాన కారణాలు.

చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు..

వీటిని దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర ప్రభుత్వం, కౌమార బాలికల్లో రక్తహీనత, ఎదుగుదల లేకపోవటం, పౌష్టికాహార లోపాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న 10–19 ఏళ్ల విద్యార్థినులకు స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించాలని ఆదేశించింది. గత నెలలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, డిసెంబరు నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు స్కూళ్లలో చదివే విద్యార్థుల్లో కూడా రక్తహీనత నివారణకు సంబంధించిన టెస్టులు పూర్తిచేసేలా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశించాలని విద్యాశాఖ అధికారులకు స్పష్టం చేశారు.

విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్కూల్ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. తెనాలి డివిజనులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఈనెల 1–9 తేదీల్లో స్క్రీనింగ్ టెస్టులు పూర్తిచేశారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించి స్వల్పం (మైల్డ్), మధ్యస్థం (మోడరేట్), బాగా తక్కువ (సివియర్) కేటగిరీల్లో నమోదు చేశారు.

సగం మందికి రక్తహీనత సమస్య!

ఆ గణాంకాలను పరిశీలిస్తే దాదాపు సగం మంది ఏదొక కేటగిరీలో రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నట్టు స్పష్టమవుతోంది. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలోని పాఠశాలలు/ కాలేజీలో 10–19 ఏళ్ల మధ్య బాలికలు 2,233 మందికి స్క్రీనింగ్ టెస్టులు చేయగా, వీరిలో 834 మంది మైల్డ్, 379 మంది మోడరేట్, ఆరుగురిలో హిమోగ్లోబిన్ మరింత తక్కువని తేల్చారు. డివిజనులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 4,687 మంది బాలికలకు చేసిన పరీక్షల్లో 1071 మంది మైల్డ్ కేటగిరీలో, 1183 మంది మోడరేట్ కేటగిరీలో ఉన్నారు. తొమ్మిదిమందిలో రక్తహీనత ఎక్కువగా ఉందని తేలింది. వీరందరికీ ప్రభుత్వం ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లను పంపిణీ చేస్తోంది.

పోషకాహార లోపమే ప్రధాన కారణం

నేటికాలంలో మారిన జీవనశైలితో ఆహారం తీసుకునేందు తగిన సమయం కేటాయించటం లేదు. హడావుడిగా భోజనం చేసి వెళ్లిపోవటమే జరుగుతోంది. తిన్నాం అనుకోవటమేగాని, ఏం తింటున్నాం...ఎంతవరకు శరీరానికి కావాల్సిన పోషకాహారాన్ని తీసుకుంటున్నామనే అవగాహన సమాజంలో చాలామందిలో ఉండటం లేదు. ఫలితంగానే కిశోర బాలికల్లో రక్తహీనత, ఎదుగుదల లేకపోవటం వంటి సమస్యలకు దారితీస్తోందని వైద్యులు చెబుతున్నారు. తగిన ఆహార జాగ్రత్తలతోనే ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు.

తగిన ఆహారం తీసుకోవటం ముఖ్యం



ఆడపిల్లల్లో చాలామందికి హిమోగ్లోబిన్ 10 శాతానికి మించటం లేదు. జీవనశైలి, సరైన ఆహారం తీసుకోకపోవటం ఒక కారణం. వేరుశెనగపప్పు, బెల్లం, ఆకుకూరలు అందులోనూ గోంగూర, తోటకూర, కూరగాయల్లో బీట్‌రూట్, చికెన్ లివర్ వంటివి తరచూ తీసుకోవటం ముఖ్యం.

– డాక్టర్ అన్నపూర్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, తెనాలి

క్లుప్తంగా

యాచకులకు దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నూతక్కి అబ్రహం, గుర్రం జాషువ సాహితీ పీఠం ఆధ్వర్యంలో యాచకులకు బుధవారం చెంచుపేటలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవి నూతక్కి అబ్రహం కుటుంబ సభ్యులు ఆచారి, ప్రజ్ఞచారి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్‌లో టీసీఎస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు



తెనాలి: ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ మంగళ, బుధవారాల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ప్రస్తుత ఫైనలియర్ బీకాం, బీఎస్సీ విద్యార్థులకు ఇంటర్వ్యూలను చేసినట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ తెలిపారు. అవినాష్, వరప్రసాద్ ఆధ్వర్యంలో వచ్చిన 11 మంది టీసీఎస్ సభ్యుల బృందం రెండు స్థాయిల్లో వీటిని చేశారు. టీసీఎస్ కంపెనీ ఏటా దేశవ్యాప్తంగా గల డిగ్రీ విద్యార్థులకు నేషనల్ క్వాలిఫైర్ టెస్ట్ నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి క్యాంపస్ ఇంటర్వ్యూలను చేస్తుంటుంది. ఈ ఏడాది కూడా ఆ పరీక్షల్లో నెగ్గిన ఏఎస్ఎన్ కాలేజీ విద్యార్థులకు ఇంటర్వ్యూలను చేసిందని వివరించారు. ప్రపంచంలోని ఆర్థికమాంద్యం పరిస్థితుల నేపథ్యం ప్రాంగణ ఎంపికలపై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో టీసీఎస్ లాంటి ప్రపంచ ప్రసిద్ధ కంపెనీ తమ కాలేజీలో ఎంపికలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఎంపికలు పూర్తయ్యాక ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిపారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరులోని అభయహస్త సుబ్రహ్మణ్య స్వామి దేవస్థాన తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి జరుగనున్నాయి. తొలిరోజు తిరుమంజన సేవ, 15వ తేదీన చండీ హోమం, సువాసినీ పూజ, 16 అవహంతి హోమం, 17 సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం, 18వ తేదీన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణం జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అక్రమ మద్యం కలిగిఉన్న వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని బుధవారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు. ఎస్‌ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చిర్రావూరుకు చెందిన టంకశాల శ్రీనివాసరావు తన బడ్డీ కొట్లో మద్యం నిల్వలు ఉంచి విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో తనిఖీ చేశామని, ఈ తనిఖీల్లో శ్రీనివాసరావు బడ్డీ కొట్లో 40 క్వార్టర్ బాటిళ్లు లభ్యం కావడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

అయితానగర్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 40వ వార్డులో కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: పట్టణ అయితానగర్ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 40వ వార్డు ప్యాడిసన్ పేట నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు అత్తోట శ్యామ్ దంపతుల ఆధ్వర్యంలో వార్డు నాయకులు పెద్ద సంఖ్యల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ 40వ వార్డులో ఇప్పటివరకు రూ.17.16 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ ఆసరా 651 మందికి, సున్నావడ్డీ 611, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన 508, చేయూత 281, జగనన్న తోడు 109 మందికి ఇచ్చినట్లు చెప్పారు. అలాగే అమ్మ ఒడి 394, రైతు భరోసా 183, ఫించన్‌లు 409, ఇళ్ల స్థలాలు 507 మందికి ఇచ్చినట్లు తెలిపారు. ఇది కాకుండా 40వ వార్డులో సుమారు రూ.56 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. 40వ వార్డులో ఎక్కువ మంది పేదలు నివశిస్తుంటారని, రోడ్లు కూడ ఇరుకుగా ఉంటాయన్నారు. వాటిని ఆధునీకీకరించేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను ఈకార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఇచ్చే నిధులతో పరిష్కరించనున్నట్లు ప్రకటించారు. అలాగే బాప్టిస్ట్ చర్చి పై అంతస్తు నిర్మాణాన్ని కూడ తానే చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ మెజారిటీ అందించాలని కోరారు. వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, షేక్ దుబాయ్ బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొమ్ము రాయల్, 40వ వార్డు నాయకులు మేకల పెద వెంకట రత్నం, శానం కిరణ్, జవహర్‌లాల్, లంక వంశీ, మల్లి, జవహర్, కోరపాటి వెంకటేశ్వర్లు, పల్లె రత్నం, సీహెచ్ నాని, కొమ్ము మనోజ్, తంగిరాల సురేష్, వేజండ్ల శ్రీకాంత్, ఈపూరి నికో ప్రసాద్, అత్తోట అమృతరాజు, కందుల కల్యాణ్, మందపాటి రమేష్, మట్లపూడి సైమన్, తెనాలి ఆనంద్‌కుమార్, వేజండ్ల కనకంబరం, తెనాలి పూర్ణ చంద్రరావు, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉజ్వల్ యోజనతో మహిళలకు మేలు

ఫిరంగిపురం: ప్రధానమంత్రి ఉజ్వల్ యోజనతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జూపూడి రంగరాజు అన్నారు. మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు నేతలు కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యురాలు శనక్కాయల అరుణ, సుబ్బారావు, కె.బ్రహ్మయ్య, ఎం.హనుమంతరావు, ఆర్.నారాయణ, ఈఓపీఆర్డీ నిర్మలలక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక


సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్‌లు

తెనాలిఅర్బన్: రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 17వ వార్డు సాలిపేటలోని సచివాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ పేద ప్రజల జీవితాల్లో సంక్షేమ పథకాల ద్వారా వెలుగులు నింపుతున్నారని చెప్పారు. అవన్నీ కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకోవాలన్నారు. 17వ వార్డులో ఇప్పటివరకు రూ.29.95 కోట్ల సంక్షేమాన్ని తమ ప్రభుత్వం అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల జాబితా బోర్డును చైర్‌పర్సన్ రాధిక ఆవిష్కరించారు. బుక్‌లెట్ విడుదల చేశారు. సమావేశంలో 17వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి టోపి సుభాని, నాయకులు బ్రదర్ ఆనందన్న, కావేటి ఈశ్వర్, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

–34వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం రణరంగ చౌక్ సమీపంలోని సచివాలయం వద్ద నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలియజేశారు. 34వ వార్డులో ఇప్పటివరకు రూ.12.78 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి తెలిపారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల జాబితా బోర్డును చైర్‌పర్సన్ రాధిక ఆవిష్కరించారు. అలాగే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్ బాబు, మేనేజర్ అప్పలరాజు, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు 20,35 వార్డులలో ..

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 20, 35 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 20వ వార్డు సాలిపేట–2 సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 35వ వార్డు గంగానమ్మపేట–1 సచివాలయాల వద్ద మధ్యాహ్నం 3గంటలకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నందివెలుగులో 'పల్లెకు పోదాం'..

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో వలంటీర్లకు కిట్‌లు అందజేశారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ చెన్నకేశవులు మాట్లాడుతూ సచివాలయం –1 పరిధిలో గ్రామంలో రూ.29.91 కోట్లతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పింఛన్లు అందజేశామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లను ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, సుబ్బారావు, వీఆర్‌ఓలు లక్ష్మీ, కృష్ణమూర్తి, పార్టీ నేతలు డి.దుర్గాప్రసాద్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దాం

తెనాలిఅర్బన్: రాష్ట్రంలోని యువతకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన కిట్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యత పెంచేందుకు ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. అనంతరం కిట్‌లను సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులకు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ ఎం.జశ్వంతరావు, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఎంఈఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎస్.రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తెనాలి ఆర్టీసీ డిపో ఆవరణలో కొద్ది సేపు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సీపీఎస్, జీపీఎస్ రెండు ఆప్షన్‌లు ఎంచుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించాలని కోరారు. అలాగే అన్ని కేటగిరీల వారికి ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎన్.సుధాకర్, గురవారెడ్డి, ఇ.ప్రేమ్ కుమార్, నరసింహరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలి పాడ్యమి


కృష్ణానది దిగువ ప్రాంతం సీతానగరం పుష్కరఘాట్ల వద్ద దీపాలు వెలిగించి నదిలో విడిచిపెడుతున్న భక్తులు

తాడేపల్లిరూరల్: కార్తికమాసం ముగింపు సందర్భంగా పోలి దీపాలు వదిలేందుకు భక్తులు సీతానగరం పుష్కర ఘాట్ల వద్దకు బుధవారం తెల్లవారుజాము నుంచి చేరుకున్నారు. నెల రోజులుగా శివుడిని భక్తి శ్రద్ధలతో పూజించి, చివరి రోజు అయిన బుధవారం స్నానాలు ఆచరించి నదిలో దీపాలు వదిలారు. నదీ తీరంలోని సంగమేశ్వర, సోమేశ్వర రాజరాజేశ్వరి స్వామి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కేఎల్‌యూలో నేడు ఓటర్లకు అవగాహన సదస్సు


ఓటర్ల అవగాహన సదస్సు ఏర్పాట్లపై చర్చిస్తున్న డెప్యూటీ కలెక్టర్ కె.స్వప్న

తాడేపల్లిరూరల్: యువ ఓటర్లకు అవగాహన కల్పించడానికి తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా డెప్యూటీ కలెక్టర్ కె.స్వప్న తెలిపారు. ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ సదస్సుకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఓటరు నమోదుపైన యువతీ యువకులకు అవగాహన కల్పించడానికి కీలకప్రాంతాల్లో సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సతీష్, వడ్డేశ్వరం, గుండిమెడ వీఆర్‌ఓలు ఆషా, మల్లికార్జునరెడ్డి, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అసోసియేట్ డీన్ రవీంద్రనాథ్, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, ఎన్‌సీసీ ఆఫీసర్ మానిక పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఫిరంగిపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూఅంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సమ్మె నిర్వహించారు. యూనియన్ మండల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కె.విజయ మాట్లాడుతూ సమస్యలు ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరారు.

ఆస్తి వివాదంలో వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: ఆస్తి వివాదంతో మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. చినకాకానిలో నివాసముండే జె.స్వామి(48)కి అతడికి పెద్దల నుంచి వచ్చిన పంట భూమి ఉంది. ఆ పంట భూమిలో వ్యవసాయం చేసుకుంటూ తన భార్య సుజాత, ముగ్గురు కుమార్తెలు, కొడుకును పోషించుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో స్వామి బంధువులు ఆ పొలంలో తమకు కూడా వాటా ఉందంటూ హైకోర్టు నుంచి నోటీసులు పంపించారు. రెండు రోజుల నుంచి మానసికంగా ఆందోళన చెందుతున్నాడు. బుధవారం ఇంట్లోని రాడ్‌కు తాడుతో ఉరి వేసుకుని మృతిచెందాడు. ఘటనపై స్వామి కుమారుడు నరసింహనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలిస్వర్గం పూజలు



తెనాలిరూరల్: కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలోని సంగమేశ్వరస్వామి దేవస్థానంలో పోలిస్వర్గం పూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప అమ్మవారిని దర్శించుకుని, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెనాలి మార్కెట్ యార్డు డైరెక్టర్ రావి ప్రశాంతి, రాంబాబు దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ పద్మ, అర్చకుడు కాశీ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

క్రీడలలో రాణిస్తే ఉన్నత భవిష్యత్తు



తెనాలిఅర్బన్: విద్యార్థులందరు క్రీడలపై ఆసక్తిని పెంచుకుని వాటిలో రాణించాలని అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ షబీనా తెలిపారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన క్రీడలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణంలేని ఫోన్‌లతో ఎక్కువ సేపు యువత గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరు చదవుపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం లాంగ్ జంప్, హై జంప్, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అదేవిధంగా షబీనాను ఘనంగా సన్మానించారు. విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డి.ప్రకాశరావు, ఎండీ దాసరి మురళీకాంత్, ఈడీ గీతాకాంత్ పాల్గొన్నారు.